క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడికి సత్కారం



కనకదుర్గమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు తొత్తడి వేదకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షులు తొత్తడి వేదకుమారి విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ కమిటీ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం గ్రామస్తులుగా తమకు ఎంతో సంతోషంగా ఉందని దెందులూరు ఆర్యవైశ్య సంఘ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు, సుగ్గిశెట్టి హనుమాన్ అన్నారు. సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకలరాంబాబు, కొటకల రామారావు తదితరులు వేదకుమారి, కృష్ణ దంపతులను శాలువా, పూలదండలు, బొకేలతో, అమ్మవారి జ్ఞాపికతో సత్కరించారు. పదవిని చ్చిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సై వీర్రాజు సేవలు అభినందనీయం



గాలాయగూడెంలో దెందులూరు ఎస్సై వీర్రాజు దంపతులను సన్మానించిన దృశ్యం

దెందులూరు: దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు సేవలు, విధి నిర్వహణ అభినందనీయమని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ కమిటీ పేర్కొంది. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఎస్సై సేవలను కొనియాడారు. బుధవారం ఎస్సై, ఆయన సతీమణికి శాలువా, పూలదండలు, అమ్మవారి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గణపవరంలో ఆరోగ్యసర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తాడేపల్లిగూడెం ఏరియా మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు, సీహెచ్‌వో జె.విల్సన్ అన్నారు. బుధవారం గణపవరంలో పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ఆరోగ్య సర్వే, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని, ఇళ్ల పరిసరాల్లో చెత్తా చెదారం, మురుగునీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో పాత సామాగ్రి, టైర్లు, కొబ్బరి బొండాలు వంటివి లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సహాయకులు యోహాను, అడపరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు



పెదపాడు మండలంలోని రాజుపేటలోని జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు

పెదపాడు: రాజుపేట జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులతో కళకళలాడుతోంది. ఇటీవల రాజుపేట గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు అందించారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో గ్రామంలో పైపులైన్లతోపాటు విద్యుత్ స్థంభాలు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గ్రామ పంచాయతీ ఆ స్థంభాలకు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. బుధవారం విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, స్థానిక సర్పంచ్ తొందురు క్రాంతికుమార్ స్విచ్ వేసి విద్యుత్ దీపాలను ప్రారంభించారు.

నేడు నిడమర్రులో 'గడప గడపకు'

నిడమర్రు : నిడమర్రు గ్రామ సచివాలయం పరిధిలో ఇందిరమ్మ కాలనీలో గురువారం మధ్యాహ్నం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై మూడేళ్లలో ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నేలల స్వభావం ఆధారంగా పంటల దిగుబడి

పెదవేగి : నేలల స్వభావం ఆధారంగా పంటల దిగుబడులు ఉంటాయని పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక అన్నారు. మండలంలోని న్యాయంపల్లి గ్రామంలో ఏఓ బుధవారం మొక్కజొన్న పొలాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రియాంక మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంట అనువైన నేలల్లో బలంగా పెరిగి అధిక దిగుబడి ఇస్తుందని చెప్పారు. కొన్ని రకాల చౌడు భూముల్లో మొక్కజొన్న పంటకు ఎదుగుదల లోపంతో పాటు జింక్, పొటాషియం, నత్రజని శాతం తగ్గి మొక్క దశలోనే తెగుళ్ల బారిన పడుతుందన్నారు. ఇటువంటి నేలల్లో మొక్కజొన్న సాగు చేసే రైతులు నేల స్వభావాలను భూ పరీక్షల ద్వారా తెలుసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట పొత్తు ఏర్పడే దశలో మిత్ర పురుగులు, శత్రు పురుగులు ఆశిస్తాయని చెప్పారు. పురుగుల సంఖ్యను అంచనా వేసుకుని వాటి నివారణకు అవసరమైతే పురుగు మందును పిచికారీ చేయాలని ఏఓ ప్రియాంక న్యాయం పల్లి రైతులకు వివరించారు. మొక్కజొన్న కర్రల ఆకుల మాటున మొవ్వులలో దాగి ఉన్న పురుగులను గుర్తించి రైతులతో తీయించారు. మొక్కజొన్న పంటలో పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.



న్యాయంపల్లిలో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



కొవ్వలిలో ఈ-క్రాప్ నమోదు వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ నాంచారయ్య

ఈ–క్రాప్ నమోదు

దెందులూరు: ఈ–క్రాప్ నమోదు విధానం పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. బుధవారం కొవ్వలిలో వరిచేలను వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఈ–క్రాప్ నమోదు విధానాన్ని పరిశీలించి మండలంలో గ్రామాల వారీగా సిబ్బంది ఎన్ని ఎకరాలు ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీఆర్‌ఓ కిషోర్, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

ఉంగుటూరు: బాల్య వివాహాలు చేయడం నేరమని పీహెచ్‌సీ డాక్టరు శ్రావణ రెడ్డి తెలిపారు. వెల్లమిల్లి పంచాయతీ వద్ద బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచి వస్క కుమారరాజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రావణ రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగవాళ్లకు 21 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే పుట్టే పిల్లలకు, తల్లికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

దెందులూరు: స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సుగ్గిశెట్టి నూకరాజు, అధ్యాపకుల ఆధ్వర్యంలో 2023 సంవత్సర విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీనియర్లు, జూనియర్లు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

గణితంలో ప్రావీణ్యానికి సదస్సులు దోహదం



నారాయణపురం డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు శివకృష్ణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, విద్యార్థులు

ఉంగుటూరు: అభిరుచి, ఆసక్తి పెంపొందించుకుని గణితశాస్త్రంలో ప్రావీణ్య సంపాదించేందుకు సదస్సులు దోహదం చేస్తాయని నారాయణపురం ఎస్ఎ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన న్యూమరికల్ మెథడ్స్ అంశంపై మూడు రోజులుగా నిర్వహించిన సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సదస్సులో పాల్గొన్న విశ్వేశ్వరావు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో ప్రావీణ్య సంపాదించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు. ముఖ్యవక్త టి. శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో మరిన్ని కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. కోఆర్డినేటర్ డా.కొండారవి మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకోవాలన్న తృష్ణ ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని అన్నారు. శివకృష్ణను, అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాభ్యాసం



అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : పూర్వ ప్రాథమిక విద్యే అంగన్‌వాడీ బాలలకు బలమైన పునాది అని పెదవేగి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. బుధవారం ఆయన పెదవేగి మండలంలోని కవ్వగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలలతో కొద్దిసేపు ముచ్చటించి, ఆటపాటలతో పలు అంశాలు నేర్పించారు. బాలలు కొన్ని పొడుపు కథలు, ముచ్చట గొలిపే పాటలు వినిపించారు. ఆటపాటలతో కూడిన విద్య బాలల వికాసాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. అంగన్‌వాడీ ద్వారా బాలలకు అందుతున్న పోషకాహారం నెలవారీ ఎదుగుదల, అంగన్‌వాడీ టీచర్ బాలలకు నేర్పుతున్న అంశాలపై ఆరా తీశారు. రోజువారీ అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకుని ఎంపీడీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు, బాలింతలకు క్రమం తప్పకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఎంపీడీఓ సూచించారు.

ఘనంగా వీరదుర్గ ప్రతాలమ్మ తల్లి ఉత్సవం



పెదపాడు మండలంలోని వీరమ్మకుంటలో వీరదుర్గ ప్రతాలమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

పెదపాడు: పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో వీర దుర్గ ప్రతాలమ్మ ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. మరడాని వారి ఇంటి ఇలవేల్పు అయిన అమ్మవారి ఉత్సవాలు 4రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 5గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. బ్యాండు మేళం, డప్పు వాయిద్యం, కోలాటం, కర్రసాధన, గండిరెడ్డుల మేళం శక్తి వేషాలు చిత్ర విచిత్ర వేషధారణతో అమ్మవారిని భారీ ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సమష్టి కృషి



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్

కొయ్యలగూడెం: రాష్ట్ర ప్రభుత్వానికి సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, సిబ్బంది నాలుగు స్తంభాల వంటి వారిని సమష్టిగా అభివృద్ధిలో కీలక భాగస్వాములం కావాలి అని జగనన్న మండల సచివాలయాల కో–ఆర్డినేటర్ (మండల సచివాలయాల కన్వీనర్) నూకల రాము పేర్కొన్నారు. కొయ్యలగూడెం టౌన్ పరిధిలోని నాలుగు సచివాలయాల సిబ్బందితో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సచివాలయాల కన్వీనర్ల విధివిధానాలు గృహసారథుల బాధ్యతలను ప్రజాప్రతినిధులు పార్టీ నేతలు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాము మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేయడంలో నాలుగు స్తంభాలుగా నిలిచిన మనది కీలక భూమిక కానుందన్నారు. మన సచివాలయ వ్యవస్థ దేశానికి దిక్సూచిగా నిలిచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గర్వకారణంగా నిలవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, టౌన్ కన్వీనర్ శంకు కొండ, ఎంపీటీసీ చింత శ్రీదేవి, పార్టీ నాయకులు మారిశెట్టి శ్రీను, నిక్కర్ నాగేశ్వరరావు, కొల్లూరు యశ్వంత్, పూలపల్లి రవి, త్రినాథ్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి



ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు బొకే అందజేస్తున్న ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు పద్మ, జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు భక్తులనే భగవంతుడిగా భావించి వారికి మెరుగైన సేవలు అందించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దుశ్శాలువాను కప్పి, పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ దేవుడికి, భక్తులకు సేవచేసే భాగ్యం అందరికీ దక్కదన్నారు. అటువంటి అదృష్టాన్ని పొందిన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు భగవంతుడు, భక్తుల సేవలో తరించాలన్నారు. అనంతరం గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన ట్రస్ట్ బోర్డు సభ్యుడు తానంకి గంగరాజు, బుచ్చింపేటకు చెందిన ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పాయం మంగతాయారు ఎమ్మెల్యే తలారిని కలిసి, పూల బొకేలను అందించారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మంగళవారం ఇందిరాగస్‌లోని అభయాంజనేయస్వామి సన్నిధిలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని మాదాసు గీత, బాలుర హైస్కూల్లోని తలారి లక్ష్మీ, మమత వర్ధినికి సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు, కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ వారధి ట్రస్ట్ ద్వారా 18 సైకిళ్ల పంపిణీ లక్ష్యం నేటితో పూర్తయిందన్నారు. బుధవారం దాతలు పారిజాతగిరి ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, చిట్టూరి రాజ్యలక్ష్మి, దవులూరి శ్రీరాములు వితరణతో ముగ్గురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేసినట్లు చెప్పారు. సామాజికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి, హనుమాన్ శోభాయాత్ర ప్రతినిధులు ఆకుల సాంబశివరావు, ఇర్రంకి శంభుప్రసాద్, పరాంకుశం రమణబాబు, సత్యసాయి సబ్‌జోన్ కన్వీనర్ నర్రా రాంబాబు పాల్గొన్నారు.

వేగేశ్న కుటుంబానికి మానవత పరామర్శ

గణపవరం: కోట్లాది రూపాయలు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్న వేగేశ్న ఫౌండేషన్ అధినేతల మాతృమూర్తి వేగేశ్న నూకయ్య మరణంపై జిల్లా మానవత సంస్థ తీవ్ర సంతాపం తెలిపింది. బుధవారం జిల్లా మానవ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, గణపవరం, నిడమర్రు మండలాల మానవత చైర్మన్లు వంకాయల రామారావు, సంకు శ్రీనివాసరావు, ఉండి మండల చైర్మన్ రుద్రరాజు యువరాజు, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు తదితరులు వేగేశ్న ఫౌండేషన్ అధినేతలు వేగేశ్న ఏసుధాతరాజు, వేగేశ్న ఆనందరాజు, వేగేశ్న అనంత కోటిరాజును పరామర్శించి, సానుభూతి తెలిపారు. మానవత సంస్థకు శాంతిరథాలు, ఫ్రీజర్లను వేగేశ్న ఫౌండేషన్ తరపున అందించారని, భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని వారు కోరారు. నూకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దౌర్జన్యం చేశారంటూ ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తమను బెదిరిస్తున్నారని ముత్యాల సుబ్బారావు, ముత్యాల సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన సుబ్బారావు, సత్తిబాబుకు పట్టణ పరిధిలో 5.01ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో 4.22 భూమిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నెల 6న పి.ఆదిలక్ష్మి, ఎం.గంగమ్మ, ఎం.లక్ష్మి, కె.సుబ్బారావు, కె.తిరుపతయ్య, కె.వెంకటేష్, కె.చిన్న, ఎం.శ్రీను, మరికొంతమంది కలిసి సాగుభూమిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేశారన్నారు. ఎవరైనా అడ్డు వస్తే చంపుతామని, అట్రాసిటీ కేసు పెడతా మని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉచిత యోగా శిక్షణ తరగతులు

కొయ్యలగూడెం: ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆన్‌లైన్ ద్వారా కల్పిస్తున్నట్లు కొయ్యలగూడెం యోగ ధ్యాన మిత్ర మండలి సభ్యులు ఎస్‌బీజీ శేఖర్ బుధవారం పేర్కొన్నారు. ధ్యాన ఫౌండేషన్ శ్రీ రఘు గురూజీ ఆధ్వర్యంలో 64 విడత ఆన్‌లైన్ తరగతులు పది రోజులు అందిస్తామన్నారు. ఈనెల 13 నుంచి క్లాసులు ప్రారంభమవుతున్నాయని వివరాలకు 94402 62524 నంబర్‌ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

జగనన్న ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం కావాలి



కేఎస్ పురం వద్ద ఏలూరు ఆర్డీఓ కిషోర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం కావాలని ఇళ్ల నిర్మాణం పర్యవేక్షణ చురుగ్గా జరగాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం జాతీయ రహదారిపై కేఎస్‌పురం సమీపంలో ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్డీఓ, తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఉన్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించి పరిష్కార నిమిత్తం వినతులను అందజేశారు. సమస్యలను కార్యాలయ సిబ్బందితో నమోదు చేయించి పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు ఉత్తమ సేవలు

పెదవేగి : ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందుతున్నాయని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి పూర్ణిమ చెప్పారు. బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పెదవేగి పీహెచ్‌సీ పరిధిలోని జానంపేట పంచాయతీ సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం ప్రతి పీహెచ్‌సీలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు. 104 మెబైల్ యూనిట్‌తో సహా సిబ్బంది డాక్టర్‌తోపాటు ఆశా వర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పెదవేగి పీహెచ్‌సీ పరిధిలో 28 సచివాలయాల్లో టూర్ షెడ్యూలు ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపీ అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పంపిణీ తీరుపై వాకబు చేశారు. పాఠశాలను పూర్ణిమ సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పలువురు గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యశ్రీ వైద్యం అనంతరం ఇంటిదగ్గర ఉన్న రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఆయా గృహాలను వైద్య బృందం సందర్శించింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో హెచ్‌డీఎస్ సమావేశం

జంగారెడ్డిగూడెం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యశాఖాధికారులు అన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు పలు అభివృద్ధి అంశాలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ సభ్యులు మాట్లాడుతూ హెచ్‌డీఎస్ చైర్మన్, ఎమ్మెల్యే వీఆర్ఎలీజా ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా మార్చురీ నిర్మాణం కోసం దాతల నుంచి విరాళాల సేకరణ, ధోబీ ఘాట్ ఏర్పాటుకు మండల, పట్టణ రజక నాయకులు, పెద్దలు సహకారం తీసుకోవడం తదితర అంశాలను తీర్మానం చేశారు. ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలు ప్రజలందరూ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు వైద్యాధికారులను కోరారు. ప్రతి విభాగం వైద్యులు అందుబాటులో ఉంటున్నారని, వారి సేవలు ప్రజలు వినియోగించుకునేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో హెచ్‌డీఎస్ మెంబెర్లు సూపరింటెండెంట్ బేబీ కమల, భావనరుష, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చెన్నకేశవులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సామ్రాజ్యం, హెడ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాంకు ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాంను విజయవాడలోని గొల్లపూడిలో ఆయన నివాసానికి బుధవారం వెళ్లి పరామర్శించారు. రఘురాం సతీమణి స్వర్ణకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు ముస్సే శ్రీను, దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు ఉన్నారు.

వాహనాల బహిరంగ వేలం

ద్వారకాతిరుమల: ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాల మేరకు మండల పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. అందులో దాదాపు 38 మంది పాటదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక కేసులోని స్కూటీ, ఒక కారును రూ.1,22,000, దానికి అదనంగా 18 శాతం జీఎస్టీ రూ.21,960 కలిపి విక్రయించారు. మరో కేసులోని 11 బైక్‌లను రూ.1,05,500, దానికి అదనంగా జీఎస్టీ 12,990 రూపాయలకు విక్రయించారు. ఈ సొమ్మును ట్రెజరీకి జమ చేస్తామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వేలం నిర్వహించిన వారిలో ఎస్సై సుధీర్‌తో పాటు, మోటార్‌వెహికల్ అధికారులు, తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కుకునూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మెయిన్ పరీక్షల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యేలా చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని, వెంటనే ఈ విషయాన్ని డీఎస్పీ, సీఐ, ఎస్సై దృష్టికి తీసుకురావాలని కుకునూరు సీఐ కేవీ సత్యనారాయణ బుధవారం సూచించారు. పోలీసు శాఖలో ఉద్యోగాలిప్పిస్తామంటూ గతంలో కొంతమంది మోసపూరిత చర్యలకు పాల్పడ్డారని చెప్పారు. ప్రభుత్వం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తోందని, ప్రతిభ కనబర్చిన వారికే ఉద్యోగం వస్తుందని ఆయన అన్నారు.

నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలి

టి.నరసాపురం: కృష్ణాపురం, పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం, రాజులగూడెం గ్రామాలను కలిపి నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. దీనిపై తహసీల్దార్, సర్పంచ్ తదితరులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రామాలు ప్రస్తుతం టి.నరసాపురం పంచాయతీలో ఉన్నాయన్నారు. ఈ ఆరు గ్రామాలను కలిపి నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. భూక్యా వేణుగోపాల్, కుంజా కిరణ్, పండు వీరభద్రుడు, భూక్యా సురేష్, జి.చందు పాల్గొన్నారు.